International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.6, Issue-2, February, 2019
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

# దేవరకొండ కోట

**లలిత ధనావత్**
యం.ఎ. (తెలుగు) బి.ఇడి.
సెల్ : 8919049948

## ఉపోద్ఘాతం - పరిచయం :

పూర్వము రాజులు తమ రాజ్యాన్ని రక్షించడం కోసం 7 రకాల కోటలను నిర్మించేవారు. వాటిలో ఒకటి గిరి దుర్గం. గిరి దుర్గం అంటే ఎత్తైన కొండలు, శతృ దుర్భేధ్యమైన గుట్టల పైన లేక ఏకశిల వంటి అవిభాజ్యక కొండల పైన కోటలను నిర్మించి, పరిపాలన చేసేవారు. అటువంటి వాటిలో శతృవులను జయించడానికి వీలుపడనట్టి కోటలో దేవరకొండ కోట ఒకటి.

## విషయం :

దేవరకొండ కోట నల్లగొండ జిల్లా చారిత్రాత్మక వైభవాన్ని గూర్చి సగర్వంగా సకల జనులకు తెలియజెప్పే గొప్ప కోట. ఎందరో రాజులు, చక్రవర్తులు ఏలుబడితో వెలగొందినది. దాదాపు 900 సం॥రాలు చరిత్ర కలిగిన ఈ కోట, రెండు వాగుల మధ్య నిర్మించబడినది. తూర్పు వైపు నుండి ఉప్ప వాగు, పడమర వైపు నుండి స్వర్ణముఖి వాగుల నడుమ దాదాపు 500 మీటర్ల పై ఎత్తులో ఏడు కొండల ప్రాంతాల నడుమ 524 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించబడి వుంది. దేవరకొండ కోట చాలా కాలం పాటు కాకతీయుల ఏలుబడిలో ఉంది. వీరి పాలనతో అద్భుత వైభవాన్ని చూసింది.

కాకతీయ రాజులు అయిన రేచర్ల పద్మ నాయకుల ఏలుబడిలో ఈ కోట మరింత బలిష్టంగా తయారయింది. తెలంగాణ ప్రాంతము ఎక్కువగా కొండలు, గుట్టలకు నెలవు కావడంతో తెలంగాణ ప్రాంతంలో ఎక్కువగా గిరి దుర్గాలు మనకు కనిపిస్తాయి. ఇలాంటి గిరి దుర్గాలలో ముఖ్యమైంది, నల్లగొండ జిల్లాలోని దేవరకొండ దుర్గం. ఎంతో చారిత్రిక ప్రాధాన్యం కలిగిన ఈ ప్రాంతం అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నది.

రేచర్ల పద్మ నాయకులు దేవరకొండ కోట నుండి తమ పరిపాలన చాలా సంవత్సరాల పాటు సాగించడమేగాక కోట వైభవానికి ఎనలేని కృషి చేశారు. కాకతీయ రాజుల ఏలుబడిలో దేవరకొండ కోట చాలాకాలం పాటు ఉంది.

## కాకతీయుల ప్రస్థావన :

సుమారు 1230 సంవత్సరంలో దేవరకొండకు ఆధారంగా చేసుకొని కాకతీయులు తమ రాజ్య పాలనను గావించారంటే, ఈ కోట ప్రాధాన్యత ఎంతటిదో మీరే అర్థం చేసుకోవచ్చు. దాదాపు 290 సంవత్సరాల పాటు దేవరకొండ కోట కాకతీయుల ఏలుబడిలోనే వుండి, అనేక విధాలుగా తీర్చిదిద్దబడినది.

## దేవరకొండలోని విశేషాలు :

ఈ కోటలో మొత్తం 9 ద్వారాలు, 20 మంచినీటి బావులు, 53 మెట్ల మార్గం కలిగిన బావులు, 6 డ్యామ్ వంటి నిర్మాణాలు, 5 వరకు చెరువుల నిర్మాణాలు కనిపిస్తాయి.

ఇది పూర్తి గ్రానైట్ రాయితో చెక్కబడిన 9 ద్వారాలు వీటిపై అనేక కాకతీయుల రాజు చిహ్నాలు మనకు దర్శనమిస్తాయి. గొలుసుల బాయిలో రాయితో నిర్మించిన గోడపై యుద్ధ భూమిలో యుద్ధం చేస్తున్న రుద్రమదేవి ప్రతిమ కూడా ఇక్కడ లభిస్తుంది.

9 ప్రధాన ప్రాకారాలు కూడా కోటలోపలి వైపు వెళ్ళుతున్న కొద్ది దాదాపు 30 చిన్న ప్రాకారాలు దర్శనమిస్తాయి. కోటలోకి ప్రవేశించే శత్రువులను తప్పదారి పట్టించి, వారిని బంధించడానికి, వారి ఎత్తులను చిత్తు చేయడానికి, ఎక్కడికక్కడ శత్రువుల రాకను నిరోధించడానికి ఆ ద్వారాలు నిర్మించారు. ఇది వారి దూర దృష్టికి తార్కాణం.

900 సంవత్సరాల క్రితమే ఎలాంటి సాంకేతికత అందుబాటులో లేని సమయంలో నాటి శిల్పులు, ఇంజనీర్లు శత్రువుల రాకను పసిగట్టడానికి, అలాగే ఎదుర్కోవడానికి అద్భుతంగా నిర్మించిన గోడ నిర్మాణాలు, ఆయుధాలను భద్రపరుచుకొనే ఆయుధ భాండాగారాలను చూసి ఆశ్చర్యానికి గురి అవుతారు. ప్రతి ప్రధాన ద్వారం వద్ద మర ఫిరంగులను అమర్చే శత్రువులను సమర్థవంతంగా ఎదుర్కొనే విధంగా వివిధ నిర్మాణాలను వారు ఏర్పాటు చేసుకున్నారు. కోట ప్రధాన ద్వారం కోటకు దక్షిణ దిశలో ఉంది. దేవరకొండ కోటకు రెండో ప్రాకార ద్వారం ఉంటుంది. ప్రాకారానికి ప్రాకారానికి మధ్య వ్యత్యాసాలు ఉన్నాయి.

ఈ రాజుల కాలంలో సాహిత్యం అభివృద్ధి చెందినది అని చెపుతుంటారు. మొదిగొండ ప్రాంతంలో కవులు నివశించినారని వివిధ గ్రంధాలలో సూచనప్రాయంగా కన్పించింది. కాని లిఖితమైన ఆధారాలు లభ్యం అవడం లేదు.

## ముగింపు :

ఈ కోట ఎంతో ప్రాముఖ్యత సంతరించుకొని ఉన్నదని చెప్పటానికి నేటికి ప్రధాన ద్వారాలపై పూర్ణ కుంభాలవంటి నిర్మాణాలు కనిపిస్తాయి. గోడపై రాతి నిర్మాణాలలో సింహం, అశోకచక్రం, చేప, నాగసర్పాల్లాంటి పలు గుర్తులు కనిపిస్తాయి. ఏ కోటకు లేని నాగబంధం ఈ కోట యొక్క ప్రత్యేకత. అలా కోట చుట్టూ అష్టదిగ్బంధనం పేరుతో నిర్మించబడిన పలు దేవాలయాలు మనకు కనిపిస్తాయి.

## ఉపయుక్త గ్రంధాలు :

1) దేవరకొండ చరిత్ర
2) నల్లగొండ జిల్లా చరిత్ర - బి.యస్. శాస్త్రి
3) తెలంగాణ కోటలు - నాగబాల సురేష్‌కుమార్
4) స్థానికుల మౌకిక కథనాలు
5) కోట సందర్శన.